# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను తమకు స్వయంగా అందజేయవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.
- ❖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా ఏడోసారి రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో రెండు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 45 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.
- ❖ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని దేశ వ్యాప్తంగా ఈరోజు జరుపుకుంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను తమకు నేరుగా అందజేయవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ పని దినాలతో పాటు, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా తాము కార్యాలయంలో అందుబాటులో ఉంటే అందజేయవచ్చు అన్నారు. సమావేశాలు, ఇతర కారణాల వల్ల తాను కార్యాలయంలో అందుబాటు లేని పక్షంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారులకు గానీ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదులు అందజేయవచ్చని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా ఏడోసారి రెపో రేటును యథాతథంగా ఉంచింది. గవర్నర్ శక్తికాంత దాస్ ఈ రోజు ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ప్రకటించారు. మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) రెపో రేటును 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు. పర్యవసానంగా, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (SDF) రేటు 6.25 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (MSF) రేటు, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉన్నాయి. గత నెల మార్చి 29 నాటికి భారతదేశ విదేశీ మారక నిల్వలు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 645.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపారు.

=======================

రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 45 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు రేపు రాయలసీమలోని వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో గరిష్టంగా 41 నుంచి 43 డిగ్రీలు, దక్షిణ కోస్తాలోని పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో 41 నుంచి 44, ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో 41 నుంచి 45 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. వడగాలు కారణంగా ప్రజలు పగటిపూట బయటికి వెళ్లేటప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది.

=======================

బాబు జగజ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కృష్ణా జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ కొనియాడారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబు జగజ్జీవన్ రామ్ 116వ జయంతి మహోత్సవ వేడుకలను కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు చేశారని తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, అదనపు ఎస్పీ  బి.విజయభాస్కర్, పోలీస్ అధికారులు బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినారు. అనంతరం మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిస్వార్థంగా పోరాడారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్ అని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవి లత మాట్లాడుతూ, పిల్లలను ఉన్నత విద్యను చదివించాలని, అప్పుడే బాబు జగజ్జీవన్ రామ్ ఆశయానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.

=======================

తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూశారు. రెండు రోజుల క్రితం గుండెపోటుతో హైదరాబాద్ లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ రోజు మృతి చెందారు. పదేళ్లపాటు టెలీప్రాంప్టర్ లేకుండా పేపర్ చూసి చెప్పేవారు. 1983 నవంబర్ 14 నుంచి దూరదర్శన్‌లో వార్తలు చదవడం ప్రారంభించారు. 2011లో పదవీ విరమణ చేసేవరకు దూరదర్శన్‌లో పని చేశారు.

విరామం

=======================

విద్య, వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని అటవీ, భూగర్భగనుల శాఖామంత్రి, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈరోజు చిత్తూరు జిల్లా పుంగనూరులోని అరడిగుంటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతంగా కొనసాగుతోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్ళీ గెలిపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు.

=======================

దూరదర్శన్ మొదటి తరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతిపై వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరిమిత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రోజుల నుంచి శాంతి స్వరూప్ మార్గదర్శక ప్రయత్నం చాలా మంది వార్తా ప్రసారకులకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలు నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు పిలుపు నిచ్చారు. ఈ రోజు కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ శాతం సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని అన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 14 లక్షల మందికిపైగా ఓటర్లుగా నమోదు అయ్యారని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఆయా ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. కేంద్ర బలగాలు ఆధ్వర్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, గతంలో జరిగిన ఎన్నికలలో ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పోలిస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికలలో నూరు శాతం పోలింగ్ జరిగే విధంగా సహకారం అందించాలని అల్లూరి సీతా రామరాజు జిల్లా ఎన్నికల అధికారి, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. వివిద రాజకీయ పార్టీల నేతలతో తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు, ప్రచార కార్యక్రమాల అనుమతులు, ర్యాలీలు, సభలు, సమావేశాలపై ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు విజవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 నిత్యావసర సేవలు అందించే శాఖలకు సంబందించిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తోందని చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవి సెలవుల కారణంగా తిరుమలకు భారీ సంఖ్యలో వచ్చే యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ పాలకమండలి పలు నిర్ణయం తీసుకుంది. సాధారణ భక్తులకు దర్శనం కల్పించేందుకు గాను వచ్చే మూడు నెలల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎ.వి. ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈరోజు నిర్వహించిన “డయల్ యువర్ ఈవో” కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సాధారణ భక్తులకు ఎక్కువ సమయం దర్శన వేళలు కల్పించడానికి సిఫార్సు లేఖలపై వీఐపీ దర్శనాన్ని రద్దు చేసినట్లు వివరించారు. క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు, బయట లైన్లలో వేచి ఉండే భక్తులకు అన్నప్రసాదం, మజ్జిగ, వైద్య సదుపాయాలు నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ స్థాయి కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే జెఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షలు రాసే అభ్యర్థులకు జాతీయ పరీక్షల సంస్థ-ఎన్టీఏ సూచనలు జారీ చేసింది. పరీక్ష రాసే సమయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

=======================